క్లుప్తంగా

అంగన్‌వాడీల్లో బాల్యం నుంచే చక్కని నడవడిక



ఉంగుటూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించడం వలన వారికి అవసరమైన పోషకాహారం అందించడంతో పాటు బాల్యం నుంచే చక్కని నడవడిక, క్రమశిక్షణ అలవడతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మాదేవి తెలిపారు. ఆత్కూరు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగే ప్రీ స్కూల్ కార్యక్రమాలు, పౌష్టికాహారం, తదితర అంశాలను పద్మాదేవి వివరించారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని ఏడు కేంద్రాల నుంచి 10 మంది చిన్నారులను ఎంపీపీ పాఠశాలకు పంపించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూతపాటి ఎస్తేరమ్మ, ఆశీర్వాదం, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

గ్రేడ్ - 5 కార్యదర్శుల బదిలీ

విజయవాడరూరల్: గ్రామ సచివాలయాల్లో గ్రేడ్ – 5 కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న వారికి డ్రాయింగ్, డిస్పర్స్‌మెంట్ ఆఫీసర్‌గా బాధ్యతలు కేటాయిస్తూ ప్రభుత్వం బదిలీలు చేసింది. రూరల్ మండలంలో ఎ.జయభరత్‌రెడ్డి, పాతపాడు గ్రామం నుంచి గంపలగూడెం మండలం గాదెవారి గూడెం, పి.విజయ్ అంబాపురం గ్రామం నుంచి జక్కంపూడి గ్రామం, టి.నారాయణ కొత్తూరు తాడేపల్లి గ్రామం నుంచి వీరులపాడు మండలం దాచవరం, ఎ.వెంకటరాధిక రాయనపాడు గ్రామం నుంచి చిన నందిగామకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

పారిశుద్ధ్యమే లక్ష్యంగా ప్రత్యేక డ్రైవ్



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం లక్ష్యంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని పోరంకి, తాడిగడప, కానూరు సర్కిళ్లలో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పోరంకి ప్రభునగర్‌లో ఈదురు గాలులకు పడిపోయిన చెట్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. తాడిగడప గ్రామంలో ప్రధాన రహదారి, రామానగర్ కట్ట, శ్రీనివాసానగర్ కాలువ కట్ట, నిమ్రా కాలనీలో పర్యటించి పారిశుద్ధ్యంపై ప్రత్యేక సూచనలు ఇచ్చారు. ప్రతి ఇంటికీ వెళ్లి చెత్త సేకరించాలన్నారు. నిమ్రా కాలనీలో డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కానూరులో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు కొన్ని ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో నేతలు అనుమోలు ప్రభాకరరావు, దోనేపూడి రవి, రామ్‌కుమార్, గురజా రవి పాల్గొన్నారు.

7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



నున్న(విజయవాడరూరల్): వచ్చే నెల 7వ తేదీన వరంగల్‌లో జరిగే ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంద వెంకటేశ్వరావు మాదిగ విజ్ఞప్తి చేశారు. నున్న గ్రామం సీఎస్‌ఐ చర్చి కాంపౌండ్ వద్ద గురువారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ మండల సమావేశానికి ముఖ్య అతిథిగా వెంకటేశ్వరరావు మాదిగ విచ్చేసి మాట్లాడారు. మాదిగల చిరకాల వాంఛ ఎస్సీ వర్గీకరణ ఆకాంక్ష త్వరలోనే నెరవేరబోతుందన్నారు. జూలై 7న వరంగల్‌లో జరిగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో మాదిగ ఆత్మ గౌరవ కవాతు, బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. ఈ సభకు గన్నవరం నియోజకవర్గంలోని ప్రతి మాదిగ కుటుంబం తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి మంద వేణుబాబు మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి కిషోర్, కోటేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివి

- కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ
- ఘనంగా రెవెన్యూ దినోత్సవం
- విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులకు సన్మానం



విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్ బాలాజీ తదితరులు

కంకిపాడు: రెవెన్యూ ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివని కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ బాలాజీ విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ 1786వ సంవత్సరం జూన్20న రెవెన్యూ శాఖ ఆవిర్భవించిందన్నారు. రెవెన్యూ శాఖకు 238 ఏళ్ల చరిత్ర ఉందని చెప్పారు. ప్రజలకు నిరంతరాయంగా మెరుగైన సేవలు అందించటంలో ఉద్యోగులు ఎంతో బాధ్యతతో పనిచేస్తున్నారన్నారు. ఒత్తిడిని అధికమిస్తూ ప్రజలకు సమర్థంగా సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఉద్యోగుల సేవలను గుర్తించి ప్రభుత్వం జూన్ 20న రెవెన్యూ డే నిర్వహించాలని ఆదేశించటం సంతోషకరమన్నారు. పౌరులకు అందించే రెవిన్యూ సేవలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకోవాలని, ఓర్పుతో, శ్రద్ధతో పనిచేయాలని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉయ్యూరు ఆర్డీవో డి.రాజు, జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర్‌నాయక్, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, ఎంపీడీవో పి.అనూష, వీఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కరించండి..

మురుగు సమస్య పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ఆదేశించారు. మండలంలోని పునాదిపాడు పరిధిలో విస్తరించిన చైతన్య విద్యాసంస్థల మురుగుతో పునాదిపాడు ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న మురుగు సమస్యపై స్థానికులు వినతులు అందించారు. ఎస్టీపీ ప్లాంట్ ద్వారా శుద్ధి చేసిన పిదపే మురుగు బయటకు వదలాలని, పైపులు ప్రత్యేకంగా బుడమేరులో కలిసేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి పర్యవేక్షించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.



పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సన్మానిస్తున్న ఆర్డీవో రాజు, తహసీల్దార్ ప్రసాద్



ఉంగుటూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్బారావు

ప్రజలకు పూర్తి స్థాయిలో రెవెన్యూ సేవలు

పెనమలూరు: ప్రజలకు పూర్తి స్థాయిలో రెవెన్యూ సేవలు అందే విధంగా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో డి.రాజు తెలిపారు. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ పీఎస్‌డీప్రసాద్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాజు మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖ ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉండి సేవలు అందిస్తోందన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో రెవెన్యూ శాఖ ముందంజలో ఉంటుందని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది కూడా ప్రజలకు ఉన్నతమైన సేవలు అందించడంలో తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఇటీవల పదవీ విరమణ చేసిన రెవెన్యూ ఉద్యోగులు నారగాని వెంకటేశ్వరరావు, ఎంఎస్.రామానుజంలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుమార్‌బాబు, డీటీ భవాని, ఆర్‌ఐలు రమేష్, భరద్వాజ్, సర్వేయర్లు అనిల్‌కుమార్, శివరామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరులో రెవెన్యూ దినోత్సవం

ఉంగుటూరు: ప్రజలకు రెవెన్యూ సేవలను సకాలంలో అందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని తహసీల్దార్ జె.సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం రెవెన్యూ ద్వారా అందజేసే సేవలను తహసీల్దార్ సుబ్బారావు వివరించారు. అనంతరం విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి దాసరి వెంకటేశ్వరరావు(మునసబు)ను సత్కరించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ శ్రీలత, సర్పంచ్ కాటూరి వరప్రసాద్, ఎంపీటీసీ దాసరి బాపినీడు, వీఆర్వోలు, రెవెన్యు సిబ్బంది, డీలర్లు, ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



పూజల్లో పాల్గొన్న భక్తులు

పోరంకి గ్రామం లక్ష్మీపురం కాలనీలో వేం చేసి ఉన్న శ్రీ పద్మావతి గోదాదేవి శ్రీ వెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. ముగింపు ఉత్సావాల్లో భాగంగా మహా పూర్ణాహుతి, ప్రాయశ్చిత్త హోమం, నిత్య హోమం, వసంతోత్సవం, చక్రతీర్థోత్సవం, శ్రీవారి రథోత్సవం, ధ్వజా అవరోహణ, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపుసేవ తదితర పూజా కార్యక్రమాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. – పెనమలూరు

నేటి నుంచి శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు



శ్రీవెంకటేశ్వర స్వామి వారు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసిన పద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి వార్ల దేవస్థాన త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్. అప్పారావు, మరుపిళ్ళ హనుమంతరావు తెలిపారు. దేవస్థాన ఆవరణలోని కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బ్రహ్మోత్సవాల వివరాలను పాలక మండలి వివరించింది. ఉత్సవాలను టీటీడీ వేద పాఠశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మురికిపూడి మణిదీప్‌కుమార్, ప్రధాన అర్చకులు వినుకొండ రత్నమాచార్యులు శ్రీనివాసుని గోపాల్ పర్యవేక్షణలో నిర్వహించనున్నామని చెప్పారు. 5 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో తొలి రోజున స్వామి వారికి మంగళస్నానాలు, నూతన వధూవరులుగా అలంకరణ చేస్తామని పేర్కొన్నారు. రెండో రోజులు హోమాలు, నవగ్రహ ఆరాధన, సహస్ర దీపాలంకరణ సేవ జరుగుతుందన్నారు. 23వ తేదీ స్వామి వారి కల్యాణోత్సవం, 24వ తేదీ స్వామి వారికి పుష్పయాగం, సాయంత్రం నగరోత్సవ సేవ ఉంటుందని చెప్పారు. 25వ తేదీ శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రధాన మూర్తికి పంచామృత అభిషేకాలు, పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. సాయంత్రం పవళింపు సేవ జరుగుతుందన్నారు. స్వామి వారికి నిర్వహించే విశేష పజలు, అభిషేకాలు, అర్చనలో పాల్గొనాల్సిందిగా భక్తులందరికీ ఆహ్వానం పలుకుతున్నామన్నారు. సమావేశంలో కమిటీ కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, గౌరవధ్యక్షుడు బెవర సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, పొట్నూరి రాజా, పిళ్లా విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణామూర్తికి విశేష పూజలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి ఆలయం వద్ద దక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆలయానికి దక్షిణం వైపుగా ఉన్న దక్షిణామూర్తికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. అనంతరం పూజలు నిర్వహించగా, ఆలయ ఈవో కెఎస్.రామరావు పాల్గొన్నారు. పలువురు ఉభయ దాతలు, భక్తులు పాల్గొని తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని పలు ప్రాంతాల్లో గురువారం చెట్ల కొమ్మలను విద్యుత్ సిబ్బంది తొలగించారు. విద్యుత్ లైన్లకు చెట్ల కొమ్మలు అడ్డు వచ్చి విద్యుత్ సరఫరాకు ఆటంకంగా మారడంతో ఈ చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యాలయం, పలు అంతర్గత రహదారుల్లోని చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు మాట్లాడుతూ.. చెట్ల కొమ్మలు తరుచూ లైన్లకు అడ్డురావడంతో నిప్పురవ్వలు రాలడం, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. దీంతో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేసి పలు ప్రాంతాల్లో ఈ సమస్యలను పరిష్కరించామని తెలిపారు. విద్యుత్ సంబంధిత సమస్యలు ఎదురైతే నేరుగా ఎనికేపాడులోని విద్యుత్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని ఏఈ సూచించారు.


యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని గాంధీజీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమణశ్రీ అన్నారు. ఆ కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సాయంత్రం పాతబస్తీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమణశ్రీ మాట్లాడుతూ యోగాతో శరీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు. యోగా భారతీయుల సొంతమైన పురాతన ప్రక్రియగా పేర్కొన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా యోగాను ఆచరించి అనేక మేలును పొందుతున్నారని చెప్పారు.

ప్రేమ కలాపం







యనమలకుదురు సమీపంలో తాటి చెట్లలో చిలుకలు గూళ్లు ఏర్పాటు చేసుకున్నాయి. ఈ గూళ్లలో చిలుకల ప్రేమ కలాపాన్ని గురువారం సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా మెరుగుపర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీరమ్య

విజయవాడరూరల్: వాతావరణంలో వస్తున్న మార్పుల కనుగుణంగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు మెరుగుపర్చాలని, మురుగు కాల్వల్లో నీరు నిల్వ ఉండకుండా పారుదల అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని రూరల్ ఎంపీడీవో ఏ.శ్రీరమ్య గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. త్వరంలో వర్షాలు కురిసే నేపథ్యంలో వర్షం నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చూడాలన్నారు. నీరు నిల్వ ఉన్న చోట నుంచి దోమల ఉధృతి ఉంటుందని, వాటి ద్వారా అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. దోమల నివారణకు పారిశుద్ధ్య చర్యలు మెరుగుపర్చాలన్నారు. తాగునీటి ట్యాంకుల్లో నిబంధనల ప్రకారం బ్లీచింగ్ పౌడర్ కలిపి సరఫరా చేయాలన్నారు. తాగునీటి పరీక్షలు నిర్వహించి ల్యాబ్ ద్వారా వచ్చే ఆర్సీలను బట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి గ్రామంలో సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాలు తప్పనిసరిగా పని చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో జరిగే ఉపాధి పథకం సోషల్ ఆడిట్‌కు అందరూ గ్రామసభలను నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఈవోఆర్డీ బీఎల్‌వీ శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన



అభ్యర్థులకు సూచనలిస్తున్న కంపెనీ ప్రతినిధులు



రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్న అభ్యర్థులు

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో గురువారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. రాష్ట్రానికి చెందిన 15 ప్రముఖ కంపెనీలు హాజరైన ఈ జాబ్‌మేళాకు 480 మంది యువతీ యువకులు పాల్గొన్నారు. వీరి సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూలు అనంతరం 122 మందిని వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక చేశాయి.

నైపుణ్యాలు పెంచుకోవాలి..

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. యువతీ యువకులు విద్యతో పాటు వ్యక్తిగత నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చని చెప్పారు. కళాశాలలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులతో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా జాబ్‌మేళా నిర్వహించామన్నారు. వీరిలో ఎక్కువ మందికి ఉద్యోగాలు లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జాబ్ మేళా ప్రతినిధి అరవింద మాట్లాడుతూ.. రాష్ట్రంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పారు. యువశక్తిని వినియోగించుకునేందుకు అనేక కంపెనీలు ముందుకు వస్తున్నాయన్నారు. ఈ జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు జీతాలను కంపెనీలు చెల్లించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

పబ్లిక్ హెల్త్‌పై పరిశోధనలు విస్తృతం కావాలి



రీసెర్చి గ్రాంట్ అందజేస్తున్న న్యూయార్క్ సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల ప్రతినిధులు

గన్నవరం రూరల్: పబ్లిక్ హెల్త్‌పై విద్యార్థులు విస్తత పరిశోధనలు చేయాలని న్యూయార్క్‌కు చెందిన సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల ప్రతినిధులు గేల్ గిబ్సన్ గేయిల్, మిచెల్ స్టీవెన్, కోర్ట్నీ ఇన్నిస్, సైమన్ సూచించారు. చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ డెంటల్ కళాశాలలో దంత వైద్య విద్యార్థులకు హెల్త్ ఇన్ఫర్మేటిక్స్, హెల్త్ మేనేజ్‌మెంట్ తదితర కోర్సులపై గురువారం జరిగిన సదస్సులో అవగాహన కల్పించారు. ప్రపంచవ్యాప్తంగా పబ్లిక్ హెల్త్ కాపాడటంలో విద్యార్థి దశ నుంచే పరిశోధనలు విస్తృతం కావాలని ఆకాంక్షించారు. దీనికి తమ కళాశాలలో అపూర్వ అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ మేరకు డాక్టర్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలకు, న్యూయార్క్ సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలకు ఎంవోయూ కుదిరినట్లు స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు తెలిపారు. ఈ సందర్భంగా పరిశోధన పత్రాలు సమర్పించిన 15 మంది విద్యార్థులకు, గైడ్‌లుగా వ్యవహరించిన హెచ్‌వోడీలు, అధ్యాపకులకు అతిథులు రీసెర్చి గ్రాంట్ అందజేశారు. డెంటల్ ఎడ్యుకేషన్ కన్వీనర్ డాక్టర్ కె.అజయ్‌బెనర్జీ, హెచ్‌వోడీలు రవిచంద్ర, ఎ.కాశేశ్వరరావు, కోటేశ్వరరావు, శ్రీహర్ష, జీఎం నాయుడు, ప్రభాత్, సునీల్ చంద్ర, కిరణ్‌కుమార్, సురేష్, ఏవో వై.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు. అతిథులకు కళాశాల యాజమాన్యం మెమెంటోలను అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించింది.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నర్తన నటరాజ నాట్యాలయంకు చెందిన పలువురు చిన్నారులు గురువారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై కళాబృందానికి చెందిన చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందచేశారు.